# మా అమ్మ

శ్రీమతి కె. విమలాదేవిగారు

"అంతా నాన్నా అని పిలుస్తారు. మా నాన్న ఏడే అమ్మా."

"తెలివి తక్కువచేత ఆయనతో పోట్లాడేను నీ పుటకలకు. గీతవుంటే యెప్పటికైనా కలుస్తామేమో."

ఇంట్లో వీళ్లు మాట్లాడుకొనే ధోరణిచూస్తే నాన్నగారు మంచివారని తెలివికలవారని చేతులార కాపురము పాడుచేసుకొని అమ్మ పుట్టింటికి చేరిందని తోచేది. ఎవరన్నా బంధువులు యెరిగివున్నవాళ్లు ఇంటికి వస్తే నాన్నగారిమాట తప్పక వచ్చేది. అప్పటి ప్రసంగాలు విన్నప్పుడు నాన్నచాలా చెడ్డవాడనిపించేది. ఎప్పటికైనా కలిస్తే నిజం నిమ్మళంగా తెలుస్తుందని గోతికాడి నక్కల్లె వేచియున్నా.

అదృష్టమువల్ల మా మేనత్త చూడ్డానికి వచ్చింది. అంతవరకూ చింపిరితల, మొఖాన బొట్టులేకుండా పిచ్చిదానాల్లె వకమూల పడియున్న అమ్మ వుత్సాహముతో అత్తయ్యను కలుసుకొని "మీనాన్న యెట్లాగ వుంటారు" అని నన్ను హెచ్చరించింది. అత్తయ్య నన్ను ప్రేమతో దగ్గరకు తీసుకొని "అంత తెలివిగల మీనాన్నవుండి మీగతి యిల్లావున్నదా" యని కండ్ల నీళ్లు పెట్టుకొన్నది. మానాన్నను చూపమని దిక్కుమొఖంతో అడిగేటప్పటికల్లా హృదయం కరిగి మాట యిచ్చి దక్కుచ్చుకొన్నది. అమ్మ చాలాసేపు గుసగుసలాడింది అత్తయ్యతో. అమ్మమ్మ మర్యాదగా మాట్లాడి పంపింది.

బళ్లోనుంచి వచ్చి పుస్తకాలు సర్దుకుంటూ వుండగా "పిల్లలను తీసుకొని వెంటనే బయలుదేరిరా" అని టెలిగ్రాము వచ్చింది. మా అక్కయ్య లేకుండా వెళ్లవలసి వచ్చిందని చింతించా. నేను అమ్మా సర్దుకొని వక చిన్నమూట తయారుచేసుకొని బయలుదేరాం. కళ్ల నీళ్లు పెట్టుకుంటూ అమ్మమ్మ తాతయ్య సాగనంపారు. అమ్మ వాలకంచూస్తే బలవంతంగా ప్రయాణం చేస్తూవున్నట్టు తోచింది. రాత్రి యేడున్నర గంటలకు అత్తయ్యగారి వూరుచేరి, యెకాయెకీ వాళ్ల యింట్లోకి వెళ్లవచ్చునా, ఎందుకో జంకుతూ బయట నిలబడి కబురు పంపింది అమ్మ. అత్తయ్య ప్రేమతో బయటికివచ్చి స్వాగతంచెప్పి, "అన్నయ్య షికారువెళ్లారు లోపలికి రండి" అని తీసికెళ్లింది. "అధికప్రసంగం చేయక నీవు చెప్పదలచిన విషయం వివరముగా మాఅన్నయ్య మనసుకు యెక్కించు. ఇదివరకువల్లె తెలివి తక్కువగా ప్రవర్తించకు." "వదినా. ఆయన ముఖం చూట్టానికి భయంచేత యిన్నాళ్లు పుట్టింట నానా మాటలు పడుతూవున్నా. పిల్లలను ఆయనకు వప్పచెబుదామని ధైర్యంగా వచ్చాను. నీమేలు మరువను." ఇంతలోనే వచ్చాడయ్యా ధూకుడుగా నాన్నగారు. నేను అమ్మాపక్క గడపలో నక్కాం. యెందుకో నాకే తెలియదు. "వంట అయిందా? బావ సిద్ధంగా వున్నాడా? ఆకలిగా వున్నది వడ్డించు" అంటూ వంటయింట్లోకివచ్చి పీటమీద కూర్చున్నారు: కమ్మని కబుర్లు చెప్పడం ప్రారంభించేటప్పటికల్లా, చురుకైన వాడని యితరుల మనస్సు ఆనందింపచేయగల శక్తిగలవాడని తోచింది. మామయ్యగారు త్వరగా భోంచేసి చెయ్యి కడుక్కొని నన్ను లోపలికి పంపెను. నాన్నగారిని చూడగానే ఆయన వళ్లో కూర్చోవలెననిపించింది హృదయంలో. యెందుకో అట్లు చెయ్యలేకపోయి నించున్నా. మెరిసే కళ్లు, చిరునవ్వు చిందులతో ఎర్రని పెదవులు, బూరెలల్లే బుగ్గలు, ఆనందమును వెల్లడించు ముఖమును చూచి, తప్పక నన్ను ఆదరణతో ప్రేమించునని అనుకొన్నా.

శాంతంగా చూచి గుర్తుపట్టలా. తన ధోరణిలోనే పది నిమిషములవరకు వుండెను. "ఆ అమ్మాయి యెవరో వచ్చి చాలా సేపటినుంచి నిల్చున్నది. కూర్చో మనవే మమ్మా చిట్టితల్లీ" అనగానే "మీ అమ్మాయి. వదినే గూడా వచ్చింది. నిన్ను క్షమాపణ కోరుతుందట. ఆమె చెప్పేది విను. పిల్లలను వృద్ధిలోకి తీసుకరావడము నీ ధర్మము." అత్తయ్య గంభీరముగా జవాబు చెప్పెను. నాన్నగారు తీక్షణంగా చూస్తూ "నాతో సంప్రతించకుండా వీళ్లను రానివ్వకూడదు. పొరపాటు చేశావు" అని త్వరగా భోజనం పూర్తిచేసి, గదిలో కూర్చొని అత్తయ్యతోను మామయ్యతోను ప్రత్యేకంగా మాట్లాడి తను వక్కడే పది నిముషములు ఆలోచించుకొని నన్ను చూచి మాట్లాడుటకు సమ్మతించెను. మామయ్యగారు తనతో గూడా గదిలోనికి తీసుకొనివెళ్లి నన్ను కూర్చొబెట్టగానే ప్రశ్న పరంపరలు.

"నీ పేరేమి? యేమి జదువుతున్నావు? మీ అమ్మ పేరేమి? మీ నాన్న పేరేమి? యెప్పుడైనా మీ నాన్నను చూచావా? చూడాలనిపించిందా?" నదురు బెదురులేకుంటా ఘాటుగా జవాబులు చెప్పేటప్పటికి దంగైపోయి "అన్నంతిని నిద్రపో. రేపు యింకా మాట్లాడుదాం" అని పంపేసిరి. హాల్లో సిద్ధంగా వున్న అమ్మ మాట్లాడానికి తయారైతే "భోజనాల తర్వాత" అని నాన్నగారి దగ్గరనుంచి ఖంగుమని జవాబు. ధైర్యంగా జవాబులు చెప్పినందుకు అత్తయ్య నన్ను మెచ్చుకున్నది. భోంచేసి నిద్రపొయ్యా. మరునాడు లేచేటప్పటికల్లా నాన్నగారు స్నానంచేసి పూజచేసుకుంటూవుంటే చూచి దైవభక్తిగల మనిషి నన్ను అక్కయ్యను తప్పక ఆదరించునని తోచింది. కాల్యకృత్యములు తీర్చుకొని నేను సిద్ధమయ్యేటప్పటికల్లా పూజనుంచిలేచి నన్ను వళ్లో కూచోబెట్టుకొని తలనిమురుతూ ముద్దుబెట్టుకుంటే నాకు విపరీతమైన ఆనందంకలిగింది. ఇదివర కెప్పుడూ యిట్లావుండలా. భుజములమీద చేతులువేసి కళ్లల్లోకిచూస్తూ "నాన్నగారూ, మీవద్ద చాలా ఆనందముగావున్నది. మిమ్మల్ని విడిచివుండలేను" అనగానే "నన్నుకన్న తల్లీ, నాకూ ఆలాగేవున్నది. త్వరలోనే నాదగ్గర వుంచుకుంటా" అని ముద్దులవర్షం కురిపించారు. ఇక్కడ వీళ్లందరి ముఖాలు వికాసంగాను ఆనందంగాను వున్నాయి. ఇదివరకు చూస్తూవున్న ముఖములు తుమ్మల్లో పొద్దుకూకుతున్నట్లు వుండేవి. నాన్నగారు చాలారకాల పండ్లు తీసుకొచ్చారు. అత్తయ్య పిండివంటలు చేసింది. ఆదరణతో చూచి రెండు పరికిణీలు జాకెట్లు కుట్టించింది. వీళ్ల ఆపేక్షలోనే వుండాలనిపించింది. తిరిగి వెళ్ల బుద్ధిపుట్టలా. ఇంతలోనే నాన్నగారు తనపనిమీద ప్రయాణానికి సిద్ధమై నన్ను ముద్దాడి "త్వరగా మనము వకచోట వుంటాము. ధైర్యంగావుండు" అని కంటిచూపు దాటారు. నాహృదయంలో నివాసము యేర్పరచుకొని తర్వాతరోజు వుత్తరాలు వస్తూవుండేవి. నాన్నగారు మాట్లాడుతూవున్నట్లనిపించి నాలో ప్రేమ క్రమంగా యెక్కువైంది. వకనాడు అమ్మ అత్తయ్యతో "మాఅమ్మ పని చెయ్యనివ్వక గారాబంగా చూచి దద్దమ్మల్లే వుంచుతుంది. ఇక్కడవుండి పని నేర్చుకోవాలనివున్నది" అన్నది. "వదినా మిమ్మలను కూర్చగలిగా. యిక్కడేవుండి పని నేర్చుకొని అన్నయ్యదగ్గరకు వెళ్లు అభ్యంతరంలేదు. మీవాళ్లు అసాధ్యులు. మాయింటిమీదికి పోట్లాటకువస్తే వుంచుకోను సుమా" అత్తయ్య జవాబుచెప్పింది. ఇక్కడ మాట్లాడుకునే మాటలు నాన్నగారిమీద గౌరవము ప్రేమ పుట్టించేవి. "ఇంత శాంతంగా నా మొర వింటారని తెలిస్తే యిదివర కెప్పుడో వచ్చేదాన్ని. చెప్పేదంతా విని తిరిగి ప్రశ్నలువేస్తే జవాబు చెప్పలేకపోయినా. పరుల సలహామీద వారితో పోట్లాడి కాపురం పాడుచేసుకున్నా" అని కళ్లనీళ్లు బెట్టుకుంటే అమ్మను అత్తయ్య వోదార్చింది. "అయిందానికి దుఃఖపడకు. పిల్లను చూచేటప్పటికల్లా

ముచ్చటపడ్డాను. ఇప్పుడు తెలివిగా కాపురం నిలబెట్టుకో సుఖపడతావు. లేదా పుట్టింటికి చేరుకుంటావు." వకటికి నాలుగుమాట్లు ప్రతిపని చెప్పి అమ్మచేత జేయిస్తూ అత్తయ్య మామయ్యందు శ్రద్ధతీసుకున్నది.

సుమారు నెల రోజులు గడచాయి. "మంచి రోజు చూచి రావచ్చు"నని నాన్నగారివద్దనుంచి వుత్తరంరాగానే సంతోషంతో నా హృదయం పొంగిపోయింది. అమ్మ నిర్ఘాంతపోయి తెల్లముఖం వేసింది. అత్తయ్య మామయ్య బుద్ధులుచెప్పి ప్రయాణంచేసి పంపిరి.

పట్నం చేరేటప్పటికల్లా ప్లాటుఫారంమీద నాన్నగారు సిద్ధం, ఒక్కగంటమీద కారెక్కి చేరుకోగానే ముద్దాడి అబ్బురంగా తననివాసాని తీసికెళ్లారు. ఇంట్లో అన్ని సమృద్ధిగావుండేవి. అత్తయ్యగారింట్లోవున్న చురుకుతనంపోయి పూర్వమ్మల్లీ ప్రవర్తన ప్రారంభించింది అమ్మ. నాన్నగారు బుజ్జగించి "త్వరగా నిద్రలే. కాలకృత్యములు తీర్చుకొని, తల దువ్వుకొని, నీళ్లు పోసుకొని, బొట్టు పెట్టుకొని, వంటచెయ్యి. మనము సుఖంగా వుండవచ్చు. యిక్కడ యెవరు నిన్ను ఆరళ్లు పెట్టేవారులేరు. వేగిరం పనిలోకి దూకు" అన్నారు. ఏమి వుపయోగము లేకపోయింది. "పోనిలే. యింతకాలము యేమిపని చేయక సుఖముగా తల్లిదండ్రులవద్దవుండి సోమరితనము బాగా అలవాటు చేసుకున్నావు. వెంటనే పని చేయలేవు. వకవారము అన్ని నేను చేస్తాను శ్రద్ధగా గమనించు. తర్వాత చేసితీరాలి. జాగ్రత్త" అని యింటిపని అంతయు నాన్నగారు చక్కబెడుతూవుంటే తనుమట్టుకు స్నానము చేయడము తప్ప [illegible] వచ్చునా, యేదిలేదు. ఏవేళకు నిద్రలేవక అప్పుడప్పుడు కబుర్లాడుతూ ప్రశ్నించితే జవాబు చెప్పలేక తలవంచుకునేది. "మీఅమ్మకు అన్ని నిజము చెప్పావా. మన పెద్దమ్మాయిని కడుపుతోయున్నప్పుడు నాతో పోట్లాడి వెళ్లిన వైనం వాళ్లకు తెలుసునా? కలెక్టరు, జడ్జీ, భర్త అయితేనే యింటిపని చేస్తావని వాళ్లకు తెలుసునా?" అని అడిగితే "అన్ని చెప్పుతానా యేమి. ఇప్పటికే వాళ్లతో మాటలు లేకుండావున్నా. యీసంగతి చెపితే వూడ్చివుప్పనీళ్లు చల్లుతారు" అన్నది. "తెలివితక్కువదానివి. వాళ్లకు నీమీదవున్న ప్రేమకు తలన్నా తాకట్టుపెట్టి యే కలెక్టరునో, జడ్జీనో, నీకు తగినవాడిని తీసుకవచ్చి సుఖపెట్టేవాళ్లుగా" అంటే "ఈజన్మకింతే" అన్నది. "ముందుజన్మలోనైనా నీ కోరిక ఈడేరునేమో" అన్నాడు.

ఒకరోజున నాన్నగారు వంటచేస్తూవుంటే సహాయము చేయ ప్రారంభించింది. "మన అమ్మాయి వివాహము వైభవముగా చెయ్యాలి నాలుగు వేలు ఖర్చుపెట్టి. సిద్ధంగావున్నారా?" అన్నది. "చిన్నతల్లిని వృద్ధిలోకి తీసుకరావడానికి అంతకంటె యెక్కువ డబ్బు ఖర్చుబెడతాను. పెళ్లి యిప్పుడు చెయ్యను. బాగా చదువు చెప్పించుతాను" అని జవాబిచ్చిరి. వారిప్రత్యుత్తరము నాకు యెంతోనచ్చింది. అమ్మకు అసంతృప్తికున్నట్లు వెంటనే తెలిసింది. వారము రోజులు గడిచిపోయింది. "వంట భారము వహించ"మని నాన్నగారెక్కడకో వెళ్లిరి. అమ్మ చెట్లకొమ్మలవంక ఆకాశమువంక చూస్తూవుంటే "త్వరగా నిప్పురాజేసి వంటచెయ్యి. నాన్నగారు వచ్చేటప్పటికి సిద్ధంగాలేకపోతే కోపము వస్తుందేమో" అన్నాను. "కావలసినవాళ్లు చేసుకొని తింటారు." "ఇట్లా అయితే నాన్నగారివద్ద యెక్కువ కాలం వుండలేవని తోస్తుంది. నీసంగతి క్రమంగా [illegible] తెల్పి రప్పించుతా. మేమిద్దరము నాన్నగారివద్దవుండి హాయిగా చదువుకుంటాము. నీవు పుట్టింటికి చేరుకో" అనగానే చంపపెట్టు తీసింది. యేడుస్తూవుండగా నాన్నగారు వడ్డించు అంటూ గబగబా వచ్చిరి.

జరిగిన విషయం చెప్పగానే నన్ను వూరడించి యెత్తుకొని ముద్దాడి అమ్మ చెవులుసాగదీసి “అమ్మాయిని యెప్పుడూ కొట్టవుగద. వంట యెందుకని సిద్ధం చెయ్యలా” అని బెదరించిరి, “నేను చాకిరిచెయ్యడానికి రాలేదు. హాయిగా అమ్మ వండిపెడితే కాలము వెళ్లబుచ్చవలచా. మమ్ములను పంపించండి” అన్నది తీవ్రంగా. “వట్టి అధమస్తురాలు. యెక్కడ వున్నావో అక్కడ పడివుండలేక హటాత్తుగావచ్చి కాళ్లమీద యెందుకుపడ్డావు. ఆరాత్రి నీ కళ్లల్లోకి చూస్తే పశ్చాత్తాపము కలిగినట్లు తోచలేదు. అమ్మాయినిచూచి ప్రేమగలిగి యిక్కడికి రప్పించాను. నామీద నీకు ప్రేమలేదని యిందివరకే తేలిపోయింది. అమ్మాయి యోగక్షేమము ఆలోచించి కుదురుగా వుండు” అని మందలించెను. తనేవంట చేసుకొని కాలము గడుపుతూవుండేవారు. వకరోజున నేను సహాయముచేయడానికి వెళ్లితే నాచెయ్యి కాలింది. “యింకా చిన్నదానివి. నీవు వంటలోనికి రావద్దు” అని వారించిరి నాన్నగారు. అమ్మ చేతికి అడ్డమువస్తూ వుండేది. ఇంట్లో సామానంతా మధ్యగా అమర్చేది. నాన్నగారు కోపంతో విసుగ్గోడం పరిపాటి అయిపోయింది. మేము వారివద్దవుండడం పదిహేను రోజులు అయిందో లేదో యిల్లు దొంగలకుబెట్టి దాదాపు వందరూపాయలు నష్టంచేసి శోకాలుపెడుతూవుంటే నాన్నగారు బహుశాంతంగా ధైర్యంగా అమ్మను వోదార్చారు. “నేను బంగారం పట్టుకుంటే మన్ను అవుతూవున్నది. మీదగ్గర వుండతగను. మా వాళ్ల యింటికి పంపు”మని యేడ్చింది. “నీవు పొరపాటున తలుపులకు తాళాలువేయకపోతే దొంగలు అన్ని యెత్తుకపోయినారు. అందుకని నిన్ను వేధించదములేదు. ఇంట్లో పని బాగాచేస్తూ సరీగావుండు. చురుకుతనం అలవాటుచేసుకో” అని బుద్ధులు చెప్పిరి. ఎప్పుడు దుఃఖముతో తన్ను తిట్టుకోవడం, పని చేయక నాన్నగారిని విసిగించడం సాగించింది. “మీరు అమ్మాయిపెళ్లి నా యిష్టప్రకారం చెయ్యకపోతే మావాళ్ల యిష్టానుసారంగా యెటువంటి వెధవైనా సరే నా రెండోతమ్ముడికిచ్చి ముడివేస్తాను. మునుపు మీకు తెలియకుండా పెద్దదాని వివాహముచేయడం వల్ల వెంటనే దానిభర్త పరలోకగతుడాయెను. ఈ మాటు మాఅమ్మ పట్టుపట్టింది. యెట్లాగైన మిమ్ములను లాగదీసి పీటలమీద కూర్చోపెట్టి తీరుతుంది” అనగానే కళ్లు యెర్రచేసి “మీ అమ్మపట్టు మీ నాన్నదగ్గర సాగుతుంది. వెనక నీకు సలహాయిచ్చి నాతో పట్టుసాగించుకోలేక ఆట యెదురుతిరగడం మరచి మళ్లీ నిన్ను పంపిందా ఇంకా మూఢత్వం వదల్లా? యాత్రలుచేసిందని విన్నా తమోగుణం ఆవరించుకొనియున్నదే. ఇకమీద యీప్రసంగం నావద్ద తేవద్దు” అని గట్టిగా చెప్పిరి.

నాకు శ్రద్ధగా పాఠాలు చెప్పించుతూ వచ్చారు నాన్న. నాన్నగారికి చాలామంది స్నేహితులున్నారు. వాళ్లు తరచుగా విందులు చేసేవాళ్లు. నేనుగూడా వెళ్లేదాన్ని. చాలా మర్యాదగాను ప్రేమగాను చూచేవాళ్లు. యిక్కడవుంటే అంత స్వర్గంలా వున్నదని అక్కయ్యకు వ్రాసా. యేదిగావలెంటే అది కొని యిచ్చేవారు నాన్నగారు. నాకు యిక్కడే వుండాలని గట్టిగా వుండడమువల్ల అమ్మను బతిమాలుకున్నా.

“వేళకు వంటచేసి పెడితేతిని తన దోవను పోతారుగా నాన్నగారు. శ్రద్ధగా పనిచెయ్యి. మనము యిక్కడే వుందాము.”

“ఈ [illegible] హాయిగా యింత గోంగూర చింతకాయ, కారము, వేసుకొని కమ్మగా చేసిపెడితే తిని సుఖపడలేక యెరక్కపోయి యిక్కడికి వచ్చా. పోదాంపద అమ్మమ్మగారి యింటికి.”

“నువ్వుపో. నేనురాను. నీమూలకంగా నేను అక్కయ్యగూడ చెడిపోతాము. యిక్కడవుంటే మేముతప్పక వృద్ధిలోకి వస్తాము.” ఈ సంభాషణ జరిగిన తర్వాత

అమ్మతో మాట్లాడడం తగ్గించేశా. పిలిస్తే వినిపించుకోకుండా వుండేదాన్ని. ప్రతిరోజూ తన పుట్టింటికి పంపమని నాన్నగారిని కోరుతూ వుండేది. వారు నవ్వి కథ కట్టిపెట్టమనే వారు. ఒకరోజున "నన్ను పిచ్చిదానికింద కట్టేసి మీ యిష్టమువచ్చినట్లు మొగరాయుడికి మళ్లే పిల్లకు చదువు సాగిద్దామని తలచినట్లున్నది. పిల్లలను ధారాగతం చేస్తాననుకున్నారేమో యెట్లా వచ్చామో అట్లా వెళతాం. అడ్డు చెప్పారా భావిలో దూకి మిమ్ములను కటకటాల ఊచలందులను పెడుతా. ఆలోచించుకోండి". అనగానే తోక తొక్కిన తాచువలె లేచి "అల్లాంటి మొండి దానివి యెందుకొచ్చావు. వెనుక భావిలో పడతానంటే ఆయన శాస్త్రి మరచిపోయావా? మీయమ్మ మంచి విద్యే నేర్పి పంపింది. చావదలచిన దానవు మీ వాళ్ల యింట్లోవున్న భావిలో దూకలేకపోయావా? యిట్లాంటి దానివి నావద్ద వుండ తగవు తక్షణం నాగడప దాటు. మూడోమాటు నా నెత్తురు వానోటపోసి కొట్టావు. వెళ్లిపో". అని గట్టిగా అరచారు. అందరికన్నా బలవంతుడు రాజు. రాజుకంటె బలవంతుడు మొండివాడు. నేను రానని రాగాలు పెట్టి యేడుస్తుంటే మా నాన్నగారు దుఃఖముతో చూడలేక పడిపోగా నన్ను యీడ్చుకొని పుట్టింటికి చేరింది. నాన్నగారి మీద అన్ని అబద్ధాలు కల్పించి వాళ్లి వాళ్లతో చెప్పింది. జరిగింది జరిగినట్లు అంతా నేను చెప్పేశా. "శుభ్రంగా కాపురంచేసుకో లేక మాయిల్లు ఒట్టావు" అని వాళ్లు నిందించారు. బయట ముఖం పెట్టలేక యింట్లోనే ఒకమూల పడివుంటుంది. మా అక్కయ్యరాగానే విషయం అంతా చెప్పాను. మా నాన్నగారి దగ్గరకు వెళ్లి బాగా చదువుకుంటూ వృద్ధిలోకి రావలెనని తీర్మానించుకున్నాము. తీసుకవెళ్లటానికి వారువస్తే వీళ్లు అడ్డగించారు. శారదా చట్టము సవరణకాబడ్డ యీ రోజుల్లో సహితము బలవంతంగా రేయి అర్ధరాత్రి లగ్నానికో వాళ్ల మూడో వాడికిచ్చి వివాహం చేద్దామని పన్నాగాలు పన్నుతున్నారు. నాకు మా నాన్నగారికి, అక్కయ్యకు, యిష్టములేనుండా పెండ్లి చెయ్యాలని ముసలివాళ్ల పట్టు. మా అయిష్టము తెలుసుకోగానే ఆ తెల్లముఖం వాడు శాస్త్ర తెలివితెచ్చుకొని దూసుకున్నాడు, యెక్కడో చాకిరి చెయ్యడానికి. పెళ్లికి పూర్వము రజస్వలైతే వాళ్ల కొంప కూలిపోతుందేమోనని తారుపడేవాళ్లు. నన్ను మా అక్కయ్యను రైలెక్కిస్తే మా నాన్నగారి దగ్గరకు చేరుకొని హాయిగా వుంటాముగా. తమరు మూర్ఖులు కావడంవల్ల యితరులనుగూడా అట్లా వుంచాలని ప్రయత్నం చేస్తారు. విద్యా వికాసము లేక మొండికట్టు పట్టితే సంసారాలు ధ్వంసం. తెలివాళ్లు లేక యేడుస్తూ వుండే వాళ్లగతి యిట్లావున్నది. వీళ్ల దగ్గరవుంటే ముళ్లమీద వున్నట్లున్నది. ఏనాటికి బాకీ తీర్చుకొని మా నాన్నగారివద్దకు చేరుకొని హాయిగా చదువుకుంటూ వృద్ధిలోకి వస్తామా అని ఆదుర్దాతో నిమిషమొక యుగముగా గడుపుతున్నాము.